కథ

అందం ఆకర్షణ పోటీపడుతుంటే, వయసు, సొగసు సఖ్యతగా చెట్టాపట్టాలేసుకుని, గాయత్రి ఒంట్లో సెటిలై పోయాయి. మేకప్ అవసరం లేని మెరుపు తీగలాంటి పెద్దవాళ్లేమో- ''నిద్దర్లో లేపి, తీసుకొచ్చి పెళ్లి చూపులకు కూర్చోబెట్టినా, 'ఓకే' అయిపోతుంది...అంటూ ఆమె అందానికి తాఖీదిచ్చేవాళ్లు. దీనికితోడు చదువు, తెలివితేటలు తోడయ్యాయి బంగారానికి తావి అబ్బినట్లు. ఆమె తండ్రి గోపాల్రావు. నగరంలో లీడింగ్ క్రిమినల్ లాయర్. గాయత్రి ఆయనకు ఏకైకసంతానం కావడంతో, గారాబానికి అంతులేకుండాపోయింది. ఆమె నోరు తెరిచి, ఏదీ కోరే అవసరంలేదు. మనసులో తలెత్తే కోరికని ఇట్టే పసిగట్టే తండ్రి లభించడం తన అదృష్టం..అనుకుంటుంది గాయత్రి. తల్లి సరేసరి. భర్తకంటే, కూతురి కంటే ఆమెకు వేరే ఆలోచన కూడా ఉండదు.

# శుభవార్త

## అవధానుల సుధాకరరావు



మరో మూడు రోజులే ఉంది గాయత్రి పుట్టినరోజు. ఇరవైరెండో ఏట ప్రవేశించబోతోంది. నా బంగారు తల్లికి రంగరంగ వైభోగంగా పెళ్లి చెయ్యాలని ఉవ్విళ్లూరుతున్నాడు గోపాల్రావు. రాజ కుమారుడి లాంటి వరుడి కోసం అన్వేషణ జరుపుతున్నాడు.

నిన్న మొన్నటి దాకా గాయత్రి మనసులో వేరే ఆలోచనలకి తావుండేది కాదు. అందమైన తమ పాలరాతి భవనం, ఇంపోర్టెడ్ కారు, తను ఆడు కోటానికి ముచ్చటైన తెల్లబొచ్చు కుక్క.. ప్లస్ డాడీ. ఈ మధ్య పరిచయమైన రాకేష్ చాలా వేగంగా ఆమె ఆలోచనల్లో, మనసులో దూరిపొయ్యాడు. గాయత్రి 'సెల్' నుంచి తరచు వెళ్లే 'కాల్స్'- తండ్రి నుంచి రాకేష్‌కు మారేయి.

అనుకోకుండ ఒకరోజు ఇద్దరూ చిలుకూరు టెంపుల్‌లో తారసపడ్డారు. గాయత్రికి ఈ కలయిక చాలా ఆశ్చర్యంగా అన్పిస్తే- రాకేష్ అన్నాడు- ''మనని కలపాలని భగవంతుడి సంకల్పమేమో..'' ''నువ్వుగాని ఆ కోరికతో గుడికి రాలేదు కదా...?''

ప్రశ్నించింది గాయత్రి కళ్లింతచేసి. ముఖంలో అందాలు చెయ్యింతలయినాయి ఆ ఎక్స్‌ప్రెషన్‌కి. ఇంతలో ఎవరో 'విష్' చెయ్యడంతో ఆ 'టాపిక్' కట్ అయ్యింది.

తరువాత ఇద్దరూ 'ఐమాక్స్'లో సినిమాకి వెళ్లారు. అక్కడ గాయత్రి చేతిని తనచేతిలోకి తీసుకున్నాడు రాకేష్. గాయత్రి ఊరుకుంది. ఆ స్పర్శ సుఖం ఇరువురికి ఆనందదాయకమయ్యింది.

రాకేష్ చురుకుదనం ఆమెకి నచ్చింది. 'బైక్' చాలా స్పీడ్‌గా పోనిస్తాడు. 'టాంక్‌బండ్' ఈ చివర్నుంచి ఆ చివరికి రెప్పపాటులో దాటించేస్తాడు. ఒకసారి 'ఫిలింసిటీ'కి వెళ్లినప్పుడు ఇద్దరూ కలిసి ఒకే కప్పు ఐస్‌క్రీం తిన్నారు. ఆ తరువాత అతను, అదనుచూసి చటుక్కున 'లిప్‌కిస్' చేశాడు. గాయత్రికి భయమేసింది. ఆమెను దగ్గరకు తీసుకుని- ''గాయ్! మనం 'లవ్'లో పడ్డాం. ముద్దు పెట్టుకోవడం తప్పా...?'' అన్నాడు చెంపలు నిమురుతూ. మళ్లీ అతనే- ''మైడియర్ రాజకుమారి! ''పరిచయం ప్రేమగా మారేక- కొంచెం చనువు, కొంచె సాన్నిహిత్యం ఉంటే ఆ 'లవ్' మరింత రంజుగా ఉంటుంది...'' భుజంపై చెయ్యివేసి చెప్పాడు. ఇద్దరూ కలిసి అడుగులో అడుగు వేసుకుంటూ ఉద్యానవనాల్లో విహరించేరు. రంగురంగుల పువ్వులని చూస్తూ పరవశించేరు. అతనికి దగ్గరతనం లోలోపల యిష్టంగానే ఉంది గాయత్రికి.

ఆ తరువాత గాయత్రికి నిద్రరాని రాత్రుళ్లు ఎక్కువయ్యాయి. రాకేష్ జ్ఞాపకాల్లోకి చొరబడి, అల్లరి పెడుతున్నాడు. కవ్విస్తున్నాడు.

'డిసెంబర్'లో దుప్పటి కప్పుకున్నా ఆగని చలిరాత్రుల్లో, శ్రావణంలో వొణికించే వానచినుకుల్లో, వేసవిలో మల్లెల వాసనలు జడలో గుబాళిస్తుంటే...రాకేష్ తన పక్కన ఉంటే బావుండుననిపిస్తుంది గాయత్రికి. అతనికి 'మెస్సేజ్'లు పంపడం మొదలెట్టింది. అవి సరస, శృంగార భావాల పరంపర. చిలిపి ఊహాల తుంపర.

''రాకీ! ఐ లై క్యు. ఐ ల వ్యూ..' అంది మత్తయిన గొంతుతో.

''అంతేనా...?'' ''ఐ వాంట్ యు..'' అంది. అదే అతనికి కావలసిన రిప్లై. కాని...తెలివిగా 'గాయ్! మనిద్దరి మధ్య చాలా అంతరం. మీ నాన్నకి తెలిస్తే నా కేరాఫ్ అడ్రస్- హాస్పిటల్ బెడ్...విత్ బాండేజెస్..''

''అదేం కాదు! మా నాన్న ''రావుగోపాల్రావు'' కాదు. ఉత్తగోపాల్రావు. పర్‌ఫెక్టు జెంటిల్‌మేన్... అన్నది. ''అయితే నీతో పాటు మీనాన్న కూడా నాకు నచ్చాడు...'' చెప్పాడు రాకేష్.

***

గుళ్లోంచి ఇద్దరూ బయటికొచ్చారు. 'బర్త్‌డే' కళాకాంతులతో 'మోస్ట్ గ్లామరస్'గా ముద్దొస్తోంది గాయత్రి. రాకేష్‌కి ఆమెని చూస్తుంటే వాటేసుకోవాలనిపిస్తోంది. పిచ్చిగా నలిపెయ్యాలనిపిస్తోంది.

''గాయ్! త్వరగా నీకో 'గిఫ్ట్' కొనిచ్చి, నేను శలవు తీసుకుంటాను...''అతని మాటలకి ఆమెకి కోపం, నిరాశ కలిగేయి. ''ఏయ్ రాకీ! పిచ్చి పిచ్చిగా ఉందా? ఎటు వెళ్లేది?'' ''చాలా అర్జంటు పనొకటుంది..''

''అలాగా! అయితే నాకు 'గిఫ్ట్' ఇచ్చి, వెళ్ళు...''

''తప్పకుండా! ఏం కావాలి..?'' ''ఈ రోజంతా నువ్వు నాతోనే ఉండిపోవాలి...'' ఆమెకళ్లలో యిష్టము, ప్రేమ పోటీపడుతున్నాయి. రాకేష్ కోరికా అదే. అందుకే ఆ ఎత్తువేశాడు.

''బర్త్ డే బేబి ఆజ్ఞ...'' అన్నాడు తలొంచి. 'మల్టిప్లెక్స్'లో ఓ ఇంగ్లీష్ చిత్రం చూశారు. అది చాలా 'హాట్ మూవీ'. గాయత్రి పరిస్థితి 'హిప్నటైజ్' చేసినట్లయింది. సినిమాలో బెడ్‌రూం సీన్సు.. పక్కన రాకేష్ చొరవగా ఆమె శరీరంతో ఆడుకోవడం... ఫలితంగా- అతనడగ్గానే, అతని 'రూం'కి వెళ్లిపోయింది. అక్కడ గదితలుపులు మూసుకున్నాయి. గాయత్రి శరీరం అతని కౌగిలిలో కరిగింది. ఆమె యవ్వనం-పురివిప్పిన నెమలయ్యింది. అతను ''పులి''లా కబళించేడు ఆమె శీలాన్ని.

***

గాయత్రి తెగ ఆందోళనగా ఉంది. వారంరోజులయింది. రాకేష్ మొహం చాటేస్తున్నాడు. 'ఫోన్' చేస్తే కట్‌చేస్తున్నాడు. గాబరాతో గుండెలో రైళ్లు పరుగెడుతున్నాయి. తప్పుచేసిన ఆడపిల్ల ఎంత అలజడి చెందుతుందో ఊహకందని విషయం. నిరంతరం దుఃఖమే ఆమె అంతరంగంలో, తల్లి మొహంలోకి చూడలేకపోతోంది. ప్రేమగా తండ్రి భుజాలమీద వాలిపోవడానికి ఏదో అడ్డొస్తోంది. ఏం చెయ్యాలి..? ఈ రాకేష్ ఎందుకిలా మారేడు..? అడగ్గానే కోరిక తీర్చింది. అదే తను చేసిన తప్పా..? సడన్‌గా ఓ ఆలోచనొచ్చింది. వెంటనే సుబ్బరాజుకి ఫోన్‌చేసి- ''ఒకసారి రాగలవా?'' అనడిగింది. ''సారీ...రాలేను'' అన్నాడతను. గాయత్రి మ్రాన్పడిపోయింది. అతను కూడా మారేడా...? మళ్లీ అతనే- ''సిస్టర్! రమ్మని ఆజ్ఞాపించాలి గాని, ఆ రిక్వెస్టేమిటి..? 'టెన్ మినిట్స్'లో నీ దగ్గరుంటాను..'' చెప్పాడు. గాయత్రికి ధైర్యం కలిగింది. సుబ్బరాజు రాగానే అతని 'సెల్' నుంచి రాకేష్‌కి ఫోన్ చేయించి, ముందు అతనితో మాట్లాడించి, 'ఠక్కున' తను తీసుకుంది ఫోన్. అవతల్నుంచి రాకేష్ మాట్లాడుతున్నాడు- వింటున్నది సుబ్బరాజే అనుకుంటూ.

''ఒరే రాజూ! మొత్తానికి గాయత్రి నా సొంతం చేసుకున్నాను. అబ్బో..భలే సుఖం రుచిచూపి, స్వర్గానికి తీసుకెళ్లింది. ఓహ్..ఏం ఫిగర్రా! అద్భుతం. ఆడపిల్లంటే అలా ఉండాలి...అన్నట్టు దానిమీద నీకూ మనసుంటే చెప్పు! ఓ ఛాన్సిమ్మని రికమండ్ చేస్తా. ఏవంటావురా...?''

''బా..స్ట..ర్డ్!'' సుబ్బరాజుకి భయంవేసింది- ఆమె మహోగ్రరూపం చూసి మౌనంగా నిష్క్రమించాడు.

***

తెల్లవారు ఝామున నాలుగ్గంటలు.. మంచు కురుస్తోంది. నగరరోడ్లన్నీ బోసిపోయి ఉన్నాయి. వీధిదీపాలు ''విధ్యు''ద్ధర్మాన్ని నిర్వర్తిస్తున్నాయి. రాకేష్ బైక్ నడపుతున్నాడు. పనేమీలేదు. ఖాళీగా అమ్మాయిల వేటలో...ఊళ్లనుంచి వచ్చే బస్సుల్లో, ఒంటరిగా దిగే యువతుల కోసం అతని అన్వేషణ. నాలుగు మంచిమాటలు చెప్పి, తన 'రూం'కి తీసుకెళ్లి అనుభవించడం అతని అలవాటు. సరదా. 'సెక్స్'ని ఆక్సిజన్‌గా భావించే 'మానియాక్' వాడు.

'సడన్'గా ఒకచోట అతని బైక్‌కు బ్రేక్ పడింది. అది 'చైతన్యపురి' ఏరియా. అక్కడ...ట్రాఫిక్ ఐలెండ్ దగ్గర ఓ పిచ్చిది. పెద్దగా నవ్వుతోంది. జుత్తు విరబోసుకుని ఉంది. ఆ పిచ్చిది- మంచి వయస్సులో ఉంది. ఆమె ఒంటిపై దుస్తుల్లేవు. పిచ్చిదైనా పిటపిటల్లాడుతోంది...అనుకున్నాడు రాకేష్. ఆమె ఒళ్లుని ఆబగా చూస్తూ. అడుక్కునే దానికి ఇంత అంగసౌష్టవమా? అతని చూపులు ఆకలిగా ఆమె శరీరాన్ని తడుముతున్నాయి. ఒక్కొక్క 'మోడ్రన్ డ్రస్'లో ఆమె అందాన్ని ఊహించుకుంటున్నాడు. ఆ పిచ్చిది అతని వాలకం గమనించింది. ఆమెకి తన 'ఆడతనం' గుర్తుకొచ్చింది. అంతేకాదు. తనకీ గతి పట్టించిన ఆ మోసగాడి దురాగతం కూడా మనసులో మెదిలినట్లుంది. పక్కనే ఉన్న ఓ లావుపాటి రాయిని చేతిలోకి తీసుకుంది. శక్తినంతా కేంద్రీకరించింది. విసురుగా గురిపెట్టి కొట్టింది. ఆ రాయి ''లక్ష్యాన్ని'' ఛేదించింది. రాకేష్ నుదురు చిట్లి, రక్తం ధారగా కారింది. అతను కోపంతో-''యు డర్టీ..'' అంటూ ఆ అభాగ్యురాలి మీదకు 'అటాక్' చెయ్యబోయాడు. ఆ పిచ్చిది మరో రాయితో వాడికి ''సమాధానం'' చెప్పింది. రక్తం..రక్తం..ఎగజిమ్ముతోంది... ''హెల్ప్.. హెల్ప్..'' అంటూ అంటు కేకలువేస్తుంటే, ఆమె ''బలే... బలే..'' అంటూ చప్పట్లు కొడుతూ ఎగురుతోంది. కొంతసేపటికి కుప్పకూలిపోయాడు రాకేష్. అతని శరీరం నిర్జీవంగా మారింది-పదినిముషాలు కొట్టుకుని, గింజుకుని...

***

పోలీసుల ద్వారా ఆ వార్త సుబ్బరాజుకి చేరింది. ఆ వెంటనే అతను గాయత్రికి ఫోన్ చేసి చెప్పాడు. ఆమె మౌనంగా ఉండిపోవడంతో, అతను- ''ఏం సిస్టర్! ఫీలవుతున్నావా?'' అనడిగాడు. బదులుగా ఆమె- ''ఎస్'' అంది. ఆ తర్వాత- ''రావణ సంహారం, నరకుడి వధ! ఇదీ అలాంటి సందర్భమే!! సుబ్బరాజు! ''సుప్రభాతాన మంచి శుభవార్త'' చెప్పావయ్యా! అంది. ఆమె ఎక్సైట్‌మెంట్ అంతట్తో ఆగలేదు. హైదరాబాద్‌లోని చారిత్రక ప్రదేశాల 'లిస్ట్'లో- ఈ సంఘటన జరిగిన 'చైతన్యపురి సర్కిల్'ని కూడా చేరిస్తే బావుణ్ణు...'' అంది 'ఎగ్జైటింగ్' మొహంతో. పాపి చిరాయువు ఎందుకవుతాడు? పాపం పండేదాకా కూడా వేచి ఉండడు భగవంతుడు! గాయత్రి ఎం.ఎస్.స్టడీ కోసం 'స్టేట్స్'కి ప్రయాణ సన్నాహాలు ప్రారంభించింది.

★